ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 14 | జూన్ | 2024
పేజీలు 5

## నేటి నుంచి సిపిఐ శిక్షణా తరగతులు





-పాల్వంచలో ప్రారంభించనున్న కూనంనేని

-ఖమ్మంజిల్లా శిక్షణా తరగతులు గిరిప్రసాద్ భవన్‌లో..

2 లో

# పంద్రాగస్టు నాటికి
# లక్ష ఎకరాలకు పైగా గోదావరి నీళ్లు

- సీతారామ పేరిట రీడిజైన్ చేసి ప్రజాధనం దుర్వినియోగం
- రూ.9 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్క ఎకరాకి కూడా నీళ్ళివ్వని ఘనులు

- ఏన్కూరు లింక్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం
- మంత్రులతో కలిసి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించిన డిప్యూటీ సిఎం భట్టి
- ఇరిగేషన్ సెక్టార్‌ను నాశనం చేసిన కేసిఆర్ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పంద్రాగస్టు నాటికి 1లక్ష 20 వేల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్క అన్నారు. గురువారం గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల పథకం పనులు, పరిస్థితులు, స్థితిగతులను పరిశీలించేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మగారిపల్లి గోదావరి నది వద్ద ఎర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న వారికి జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా తో పాటు, ఎస్‌పి రోహిత్ రాజ్ ఎంఎల్ఏలు పాయం వెంకటేశ్వర్లు, డా.తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, మట్టా రాగమయి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బిజి కొత్తూరు వద్ద ఉన్న పంపుహౌస్ వద్దకు చేరుకుని పనులను పరిశీలించి, పూజలు చేసిన భట్టి విద్యుత్ సరఫారను ప్రారంభించారు. అనంతరం కాన్వాయిలో సుమారు 63 కి.మీ దూరం ప్రయాణం చేసి కాలువ పనులను, ఫేస్1,ఫేస్2, ఫేస్3 పనులను పరిశీలించారు.

మిగతా 2లో..

## ఆంధ్రా వైపు..
## రియల్టర్ల చూపు..!



-అంతా అమరావతికే
-తెలంగాణ సరిహద్దుల్లో విలువ తగ్గిన భూములు
-తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎత్తు పల్లాలతో సతమతమవుతుంది. గడిచిన ఏడాది కాలంగా ఒక రకంగా వ్యాపారం స్తంభించింది. శాసన సభ ఎన్నికల ముందు నుంచి రియల్, భూ క్రయ, విక్రయాలకు సంబంధించి తీవ్ర స్తబ్దత నెలకొన్నది. హైదరాబాద్ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా విస్తరించిన ఖమ్మంజిల్లా పై దీని ప్రభావం తీవ్రంగా ఉంది. మొన్నటి వరకు

మిగతా 2లో..

## ‘సీతారామ’
## అక్రమాలను వెలికితీయాలి




- భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఏం లాభం లేదు
- రీ డిజైన్ చేసి, సమన్యాయం పాటించాలి
- ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో అనేక అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చాయని, ఆఅక్రమాలను ప్రభుత్వం వెలికి తీయాలని కొత్తగూడెం ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సీతారామ ఎత్తిపోతల

మిగతా 2లో..

### పంద్రాగస్టు నాటికి

# లక్ష ఎకరాలకు పైగా గోదావరి నీళ్లు

**(మొదటిపేజీ తరువాయి)**

ములకలపల్లి మండలం పూసుగ్గూడెం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడారు. కేవలం రూ.2654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టులుగా రీ డిజైన్ చేసి రూ.20 వేల కోట్లకు పెంచి గత ప్రభుత్వ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. దశాబ్ద కాలంలో రూ.9 వేల కోట్లను ఖర్చు చేసిన ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీరందించలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వం అధికారంలోనికి రాగానే రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సచివాలయంలో ఉన్నత స్థాయి నిపుణులతో సమీక్షలు చేసినట్లు తెలిపారు. సీతారామప్రాజెక్టుకు ఎన్ఎస్‌పిఎల్ కెనాల్‌కు లింకు చేసేందుకు 9 కిమీ. ఉన్న ఎన్కూర్ లింక్ కెనాల్‌ను పూర్తి చేయడానికి రూ.72 కోట్లు మంజూరు చేశామన్నారు. పంపులు ట్రైల్ రన్ చేసేందుకు కావాల్సిన విద్యుత్ సరఫరా కోసం నిధులు వెచ్చించినట్లు చెప్పారు. ఎన్కూర్ లింక్ కెనాల్‌ను రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తున్నామని వెల్లడించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పుంపు హౌజ్ 1,2,3 సరఫరా ప్యాకేజీ పనులను త్వరితగతిన మొదలు పెడతామని చెప్పారు.

**ఇంరిగేషన్ సెక్టార్‌ను సర్వనాశనం చేసిన కేసిఆర్ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ప్రణాళిక లేకుండా అనాలోచితంగా ఇరిగేషన్ సెక్టార్‌ను గత ముఖ్యమంత్రి కేసిఆర్ సర్వనాశనం చేసి రాష్ట్రం కోలుకోలేని విధంగా ఆర్థిక నష్టాన్ని తెచ్చిపెట్టారని సాగునీటి పారుదలశాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కాలేశ్వరం ప్రాజెక్టుకు రూ.90,4000 కోట్లు ఖర్చు పెట్టి కేవలం 93000 ఎకరాలకు కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోనికి తెచ్చారన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు



రూ.27వేల కోట్లు ఖర్చుచేసిన గత పాలకులు ఒక్క ఎకరా కూడా కొత్త ఆయకట్టు తీసుకురాలేదన్నారు. తక్కువ సమయం, ఖర్చుతో ఎక్కువ సమయంలో సాగునీరు ఇచ్చేందుకు ఇరిగేషన్ శాఖ ప్రణాళికలు తయారు చేసిందన్నారు. రాజీవ్ సాగర్‌ను సహేతుకమైన కారణం లేకుండా రీ డిజైన్ చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. గత పాలకులు ప్రాజెక్టుల వ్యయం పెంచడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం గోదావరి నదీ జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చి సస్య శ్యామలం చేయడం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సీతారామా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కెనాల్ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మేలు జరిగే విధంగా భారీ,మధ్య, చిన్న తరహా సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పూర్తి చేసి తీరుతామని హామీ ఇచ్చారు.

# ‘సీతారామ’ అక్రమాలను వెలికితీయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

పథకం పనులు, పరిస్థితుల పరిశీలనకు ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసిన ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ములకపల్లి మండలం పూసుగూడెం వద్ద కాలువ పనులు పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడారు. సుమారు రూ.20 వేల కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు పనులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని, ఇప్పటికే రూ.9 వేల కోట్లను ఖర్చు చేశారని చెప్పారు. ఇంత మొత్తంలో డబ్బులు దారపోసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా నీరందించలేదని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని కోట్లాను కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఖర్చులో అవకతవకలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోందని, ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గోదావరినదిపై అమ్మగాలిపల్లి వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నప్పటికీ ఈ పథకం ద్వారా జిల్లాలోని భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని, ఈ ప్రాంతం



నీటిని తీసుకెళ్లి వేరే ప్రాంతాలను తడిపి సస్యశ్యాలమం చేస్తామంటే సరిపోదని, వెంటనే ప్రాజెక్టు డిజైన్ మార్చి అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎంఎల్ఏలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, డా.తెల్లం వెంకట్రావు, జారే ఆదిన్నారాయణ, మట్టా రాగమయి, తదితరులున్నారు.

# పరిహారంపై రాజీ లేదు..

**-ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించండి**
**-రైతులకు భట్టి, తుమ్మల హామీ**





**ప్రజాపక్షం/ ఏన్కూరు :** సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగదని పరిహారం విషయంలో రాజీ లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూములు కోల్పోతున్న రైతులకు హామీ ఇచ్చారు. గురువారం వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ తో కలిసి వారు మండల పరిధిలోని ఇమామ్ నగర్ నుండి ఏన్కూరు వరకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పనులు త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏన్కూరు సమీపంలో ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులు తమకు నష్టపరిహారం అందించాలని ఆందోళన నిర్వహించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా కాలువ నిర్మాణాలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనను గమనించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడతామని ఒక గజం జాగా నష్టపోకుండా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సర్వే ప్రకారం ప్రతి రైతుకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చిన తదుపరి ప్రభుత్వం నుంచి రైతులకు నష్టపరిహారం అందేవిధంగా తగు చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకునేందుకు రైతులంతా సహకరించాలని కోరారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సిపిఐ శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ రాజకీయ సైద్దాంతిక శిక్షణా తరగతులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడొక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14, 15 తేదీలలో 150 మంది పార్టీ కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తొలి రోజు శిక్షణా తరగతులు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని ప్రసాద్ తెలిపారు. తొలి రోజు నూతన లేబర్ కోడ్స్ కార్మిక వర్గం పై ప్రభావం అనే అంశాన్ని ఎండి యూసఫ్ బోధిస్తారని ఆ తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను యుగల్ రాయలు బోధిస్తారని ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు కులం, మతం వర్గ పోరాటాలు అనే అంశాన్ని ప్రో॥ కాశీం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అనే అంశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. సాంబశివరావు బోధిస్తారని పార్టీ నిర్మాణం నూతన సవాళ్లు అనే అంశాన్ని బాగం హేమంతరావు ఈనెల 15న ఉదయం 10 గంటలకు జరిగే తరగతుల్లో బోధిస్తారని ఆయన తెలిపారు. 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు నూతన ఆర్థిక విధానాలు ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసం అనే అంశాన్ని యుగల్ రాయలు బోధిస్తారని ఆయన తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కౌన్సిల్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

**పాల్వంచలో...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శిక్షణా తరగతులు పాల్వంచ లో జరగనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తెలిపారు. పాల్వంచ పట్టణంలోని దమ్మపేట రోడ్డులో గల సాయితేజ ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారన్నారు. ప్రో॥ కాశీం, యుగల్ రాయలు, ఏఐటియుసి అధ్యక్షులు ఎండి యుసఫ్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు శిక్షణా తరగతుల్లో వివిధ అంశాలు బోధించనున్నట్లు ఆయన తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

# ఆంధ్రా వైపు.. రియల్టర్ల చూపు..!

**(మొదటిపేజీ తరువాయి)**

పార్లమెంటు ఎన్నికల తర్వాత వ్యాపారాలు పుంజుకుంటాయిలే అని ఆలోచించిన వారికి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు గెలుపు గోరు చుట్టుపై రోకటి పోటులా మారింది. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తే తెలంగాణ రియల్ వ్యాపారం పుంజుకుంటుందని చంద్రబాబు నాయుడు గెలిస్తే ఆంధ్రాలో రియల్ వ్యాపార వృద్ధి జరుగుతుందని ప్రచారం జరిగింది. అందరు అనుకున్నట్లుగానే చంద్రబాబునాయుడు గెలవడం అమరావతి రాజధాని అని ప్రకటించడంతో ఖమ్మంజిల్లాలో ఉన్న రియల్టర్ల చూపు ఇప్పుడు ఆంధ్రా వైపు మళ్లింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సుదీర్ఘ సరిహద్దు ఉన్న ఉమ్మడిఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ వ్యాపారం పైన ఇప్పుడు అమరావతి దెబ్బ పడింది. అమరావతిని జగన్ పూర్తిగా నిర్వీర్యం చేయడంతో ఆంధ్రా, తెలంగాణకు చెందిన పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలంగాణపై దృష్టి సారించారు. దీనితో తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో పాటు సాగు భూములకు విపరీతమైన ధరలు పెరిగాయి. ఈనెల నాలుగున ఫలితాలు వెల్లడి కాగానే సరిహద్దు జిల్లాల రియల్ ఎస్టేట్ వ్యాపారం పై ప్రభావం కనపడింది మొన్నటి వరకు అమరావతిలో విక్రయిస్తామని బతిమిలాడిన కొనని భూముల ధరలు ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిపోయాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది. తెలంగాణలో భూములు కొన్న ఆంధ్రా వ్యాపారులు సైతం ఇప్పుడు ఇక్కడి వ్యాపారాలను తగ్గించుకుని ఆంధ్రాలోనే పూర్తి స్థాయిలో వ్యాపారాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోట్లాది రూపాయల లావాదేవీలు కలిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగిస్తే పెద్ద సంఖ్యలో భూ క్రయ, విక్రయదారులు నష్టపోవడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి కూడా గణనీయంగా గండిపడే అవకాశం ఉంది. ఇప్పటికే ఏడాది కాలంగా రిజిస్ట్రేషన్లు లేక కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ధరలు పెంచితే ములిగే నక్కపై తాటి పండు పడిన చందంగా రియల్ ఎస్టేట్ మరింత కుదేలయ్యే అవకాశం ఉంది. అటు ఆంధ్రాలోని అమరావతి పోటును తట్టుకుని తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం వికసించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నది. ఆ దిశగా ఆలోచనలు సాగాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.

# డిసిసిబిలో మళ్లీ గందరగోళం

**-తోపులాటలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** డిసిసిబిలో గందరగోళం నెలకొంది. గురువారం డిసిసిబి డైరెక్టర్ల సమావేశం జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన డైరెక్టర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. కూరాకుల నాగభూషణం రాజీనామా తర్వాత తాత్కాలిక అధ్యక్షునిగా ఎన్నికైన దొండపాటి వెంకటేశ్వరరావుకు మిగిలిన కొంత మంది డైరెక్టర్ల మధ్య విబేధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సమావేశ ప్రారంభానికి ముందు చోటు చేసుకున్న ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డిసిసిబి పాలక మండలి సమావేశానికి వచ్చిన డైరెక్టర్లు అతిథి గృహంలో కూర్చుంటున్నారని ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు దానికి తాళం వేసే ప్రయత్నంలో డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, దొండపాటి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఒకరినొకరు నెట్టుకున్నారు. తమ ఎజెండాలో డైరెక్టర్లు కోరిన అంశాలను పొందుపర్చలేదని దీనితో ఎజెండాలోని అంశాలను తిరస్కరిస్తున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. గత సమావేశంలో సైతం ఇదే అంశం పై రచ్చ జరిగిన విషయం విధితమే. సిబ్బంది బదిలీలు, ఖాళీగా ఉన్న డైరెక్టర్ల పోస్టుల భర్తీ, ఇతర అంశాలను ఎజెండాలో చేర్చాలని డైరెక్టర్లు డిమాండ్ చేశారు. పాలక వర్గ సభ్యులకు తెలియకుండా రూ. 78 లక్షలు ఇంక్రిమెంట్లు ఇవ్వడంపై సమావేశంలో చర్చ జరిగింది. రుణాలు, తదితర విషయంలో బ్యాంకు సిబ్బంది, ఛైర్మన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, లక్కినేని సుధీర్, అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, బోనాల లక్ష్మణ్‌రావు, కోటేశ్వరరావు, మేకల మల్లిబాబు, నూకల సైదులు, చావా వేణుగోపాలకృష్ణ, మోదుగు పుల్లారావు లు సమావేశాన్ని బహిష్కరించారు.

# రూ. 3 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అక్రమంగా రవాణా చేస్తున్న రూ. 3లక్షలు విలువ చేసే గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం భద్రాచలం వద్ద పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ సుంకరి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా కాటారాని కి చెందిన రేకుల సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కోలనూర్‌కు చెందిన ఏకుల సజన్‌కుమార్ వీరిద్దరు వరంగల్‌లో ఫోటోగ్రాఫర్లుగా పనిచేస్తూ గంజాయికి అలవాటు పడ్డారు. గంజాయిని కొనుగోలు చేయడానికి ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో గంజాయి అక్రమ రవాణా విక్రయాలకు దిగారు. వరంగల్ నుంచి భూపాలపల్లికి వెళ్లి అక్కడ మందల కుమార్ అనే స్నేహితుని వద్ద బైక్ తీసుకుని ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా రవులకు వెళ్లి 7.3 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం, కూనవరం రోడ్డులో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ గంజాయిని వరంగల్ ప్రాంతంలో విక్రయించడానికి తీసుకువెళ్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారని సిఐ రమేష్ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 3లక్షలు, బైక్ విలువ రూ. 2 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ దాడిలో వెంకట్, హన్మంతరావు, సుధీర్, బాలు, కరీం, విజయ్, హరీష్ తదితరులు ఉన్నారు. గంజాయి పట్టుకున్న ఎన్ఫోర్స్ మెంట్ సిబ్బందిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈఎస్ తిరుపతి లు అభినందించారు.

**25 లీటర్ల గుడుంబా సీజ్ ...**

ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 25 లీటర్ల గుడుంబాను భద్రాచలం ఎక్సైజ్ సిఐ రహీం ఉన్నీసాబేగం ఎస్ఐలు సీతారామరాజు, సాయిరాంలు గురువారం పట్టుకున్నారు. గుడుంబాను సీజ్ చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. వీటి విలువ రూ. 2లక్షలు ఉంటుందని సిఐ తెలిపారు.

# ఫోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష

**రూ. 55వేలు జరిమానా**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితునికి 20 ఏళ్లు కఠిన కరాగార శిక్ష, రూ. 55 వేలు జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి కె. ఉమాదేవి గురువారం తీర్పు వెలువరించారు. ఖమ్మంజిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామం ఎస్సి కాలనీకి చెందిన 20 సంవత్సరాల కాంపాటి కార్తిక్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామంలో ఉంటున్న ఆరేళ్ల చిన్నారిపై కన్నేశాడు. 2023 మార్చి ఐదున సాయంత్రం అభం శుభం తెలియని ఆ చిన్నారిని ఆటోలో ఇంటి నుండి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై 2023 మార్చి ఆరున చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితుని పాత్ర ఉండడంతో పకడ్బందీగా సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాంపాటి కార్తిక్ పై నేరం రుజువు కావడంతో ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి దోషిగా నిర్ధారించి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ. 55 వేలు జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించిన దర్యాప్తు అధికారి ఏసిపి బస్వారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. శంకర్, భరోసా లీగల్ అధికారి ఎం. ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ జి. రవి, కోర్టు లైజనింగ్ అధికారులు, హెడ్ కానిస్టేబుళ్లు కె. శ్రీనివాసరావు, మోహన్‌రావు, హోంగార్డు అయూబ్ లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# వైరా మున్సిపాలిటీకి టౌన్ ప్లానింగ్ అధికారి కావలెను..?

**-గత నెల రోజులుగా కనిపించని వైనం**
**-కోల్పోతున్న ఆదాయం**




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీకి టౌన్ ప్లానింగ్ అధికారి కావలెను అనే మాట ప్రతినోట చర్చనీయాంశంగా మారుతుంది. ఇదేమిటని అనుకుంటున్నారా అవునండి నిజమే. ఎందుకంటే సుమారు గత నెల రోజులుగా వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి విధి నిర్వహణలో కనిపించడం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో మున్సిపాలిటీ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుంది. భవన అనుమతులు సైతం సక్రమంగా తీసుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాల వైపు అనుమతులు ఉన్నాయా లేదా అని తెలుసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారి అసలు వైరాలో విధి నిర్వహణలో ఉన్నాడా లేక ఎటైనా వెళ్లాడా అనేది కూడా ఇప్పుడు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎందుకంటే ఒక మున్సిపాలిటీలో బాధ్యత గల అత్యంత కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారి సుమారు గత నెల రోజుల నుంచి విధి నిర్వహణలో కనిపించడం లేదు అని అంటే ఒకటి అతనకు విధులు నిర్వహించడం పట్ల ఇష్టం లేకుండా ఉండాలి. రాజకీయ ఒత్తిడిలు తట్టుకోలేక విధులకు రాకుండా ఉండాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యమైన వహించాలి. ఈ మూడు కారణాల్లో ఏ కారణం చేత టౌన్ ప్లానింగ్ అధికారి విధి నిర్వహణలో కనిపించడం లేదు. ఎవరికి అర్థం కావడం లేదు. ప్రతి వార్డులో అనుమతులు లేకుండా కొన్ని కట్టడాలు అనుమతులు తీసుకున్న వాటికి విరుద్ధంగా మరికొన్ని ప్రాంతాల్లో కట్టడాలు అనుమతులు లేకుండా లేఅవుట్లు ఇలా పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఒక మేజర్ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం వలన ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. మున్సిపాలిటీ ఎంత ఆదాయం కోల్పోతుంది అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారిని ఎందుకు రావడం లేదని ప్రశ్నించినప్పటికీ ఎలాంటి సమాచారం లేదు అని తెలుస్తుంది. దీంతో డవలప్‌మెంట్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిని పూర్తిస్థాయిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఇటు ప్రజలు, కొంతమంది పాలకమండలి సభ్యులు కోరుతున్నారు.

# సాయిబాబా ఆలయానికి మైక్‌సెట్ సామగ్రి బహూకరణ

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లిలో గల సాయిబాబా ఆలయానికి గురువారం స్థానిక వ్యాపారి చిరునోముల మాధవ్ బైక్‌సెట్ సామాగ్రిని బహూకరించారు. సాయిబాబా ఆలయంలో ప్రస్తుతం ఉన్న మైక్‌సెట్‌కు అదనంగా ఏర్పాటు చేసేందుకు రూ.5వేలు విలువైన మైక్‌సెట్ సామాగ్రిని ఆలయ అర్చకులు నాగసాయిశర్మకు మాధవ్ అందించారు. ఈ సందర్భంగా మాధవ్‌ను ఆలయ కమిటీ భక్త మండలి అభినందించింది. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు, ధాతలు సహకరించాలని సాయిబాబా భక్తమండలి విజ్ఞప్తి చేసింది.




# కేజీబీవీని సందర్శించిన మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏదులాపురం పంచాయతీపరిధిలోని కేజీబీవీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అందులో కలియతిరిగి స్పెషల్ ఆఫీసర్ ఆయేషాను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విధ్యబోదన,సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా న్యూ బాత్రుంలు, స్కూల్ గ్రౌండ్‌లో గ్రావేల్ ఏర్పాటు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్యాంసన్, తహశీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ సతీష్‌రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐ రాజిరెడ్డి, ఎస్ఐ రామారవు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు అజ్మీర అశోక్‌నాయక్, పొన్నెకంటి యాకుబ్, వంగూరి రవి, ఆరెంపుల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి కి క్రీడాకారులు ఎదగాలని నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య సూచించారు. మండలం లోని నాచేపల్లిలో గ్రామ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులు ప్రతిభ ను వెలికి తీసేందుకు దోహదపడుతుందని అన్నారు. పోటీల వలన క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపోందిస్తుందని అన్నారు. గ్రామ క్రీడాకారులు ప్రతిభ చూపి ప్రతిష్ట ను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ మందడి రాజేష్, గ్రామ పెద్దలు ముంద్ర నాగప్రసాద్, అమ్మచారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, కాలపొంగు బాబురావు, కళ్లెం శ్రీనివాసరావు, గారపాటి నరసింహరావు, రాయల రాజేందర్, రేగళ్ల రవి, యాతాకుల శ్రీనాథ్, నిర్వహకులు గట్టిగుండ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకదుర్గ సూచించారు. మండలం లోని కట్టుకాచారాం లో గురువారం అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పలువురు విద్యార్థులను బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...మూడేళ్లు నిండిన వారికి కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని బడిలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను పొందాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ఆటా, పాట, విద్యా బోధన కార్యక్రమాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, టీచర్స్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేతో ఇక్కట్లు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మిషన్ భగీరథ పథకం పై ఇంటింటి సర్వే తో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. కల్లూరు మండల పరిధిలోని ముగ్గు వెంకటాపురం, పేరువంచ, కల్లూరు, వెన్నవల్లి, మర్లపాడు తదితర గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ నీరు అందుతున్నాయా.. కనెక్షన్ ఎప్పుడు ఇచ్చారు.. మంచి నీరా.. కల్తీ నీరా.. అనేక ప్రశ్నలతో కూడిన మాన్యువల్ మరియు అంతర్జాలంలో యాప్ లో డౌన్లోడ్ చేసి పొందుపరిచే విధానంపై గత వారం రోజులుగా మండలంలో కొనసాగుతూ వస్తుంది. కానీ డౌన్లోడ్ చేయడంలో పొందుపరచడంలో తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని దీంతో మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీల కార్యదర్శులు ప్రతి గంట గంటకు ఆన్లైన్ సర్వర్ లో అంతరాలు కావడం ఇబ్బందులు పడడం జరుగుతుందని కార్యదర్శులు తెలుపుతున్నారు. ప్రతిరోజు నిర్ణయించిన లక్ష్యాన్ని అధిగమించలేక ఇబ్బందులు పడుతున్నట్లు, దీనికి ప్రత్యామ్నాయం అవగాహన కల్పించి సహకరించాలని అధికారులను కోరుతున్నారు.

